క్లుప్తంగా

బీఆర్‌ఎస్ విజయం ఖాయం

తొగుట(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి విజయం ఖాయమని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సిరినేని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎల్లారెడ్డిపేటలో బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ అధ్యక్షతన శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను అడ్డుకున్న నాయకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ స్వామి, మండల కో ఆప్షన్ సభ్యుడు కలీముద్దీన్, బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి ప్రభాకర్‌వర్మ, పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, యూత్ అధ్యక్షుడు అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): వరికోతలు ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ కోరారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నాయకుడు కత్తుల భాస్కర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు భూమయ్య, నాయకులు భద్రయ్య, కవిత, మహదేవులు, ఎల్లయ్య, లచ్చవ్వ, రజిత, మల్లేశం, సురేందర్, కనకయ్య, అంజయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను కాపాడుదాం



మొక్కలకు నీరు పోస్తున్న మున్సిపల్ కమిషనర్ సంపత్

సిద్దిపేటజోన్: మొక్కలను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ పేర్కొన్నారు. హరిత శుక్రవారంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం, పట్టణంలోని పలు ప్రాంతాల్లో మొక్కలకు నీరు పట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహిద్దాం



విద్యార్థినులతో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బాలికా విద్యను ప్రోత్సహిద్దామని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, యూనియన్ బ్యాంక్ రీజినల్ ప్రధానాధికారి వికాశ్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రూ. 2 లక్షలతో నిర్మించిన టాయిలెట్లు, ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సానిటరీ ప్యాడ్ మిషన్‌లను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు అల్పాహారం

హుస్నాబాద్‌రూరల్/అక్కన్నపేట: గ్రామీణ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం మధ్యాహ్న భోజనంతో పాటు పోషకాలతో కూడిన ఆల్పాహారం అందిస్తుందని హెచ్‌ఎం బండారి మనీల అన్నారు. పోతారం(ఎస్) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే అక్కన్నపేట మండలం అంతక్కపేట ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ నర్సంహారెడ్డి ప్రారంభించారు.

'దుబ్బాకపై సవతి తల్లి ప్రేమ'

తొగుట(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గంపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ ప్రదర్శిస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం ఆరోపించారు. మండలంలోని గుడికందులలో బూత్ అధ్యక్షులు, పన్నా ప్రముఖ్‌లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక ఉపఎన్నికల సమయంలో సిద్దిపేట, దుబ్బాక రెండు కళ్లు అని అభివృద్ధిలో సమాన అవకాశం కల్పిస్తామంటూ మంత్రి హరీశ్‌రావు ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. చందాపూర్ సర్పంచ్ నర్సింలు యాదవ్, ఉప సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు



బెజ్జంకి: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

బెజ్జంకి(సిద్దిపేట): రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లబ్ధిపొందాలని జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు సూచించారు. బెజ్జంకి వ్యవసాయ మార్కెట్‌తో పాటు గుగ్గిల్ల, బెజ్జంకి క్రాస్, దాచారం, లక్ష్మీపూర్, గుండారం, రేగులపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఎంపీడీఓ రాము, ఏపీఎం నర్సయ్యతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల మేరకు రైతులు వరి ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2,203, బీ గ్రేడ్‌కు రూ. 2,183 చెల్లిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, కార్యదర్శి వెంకటయ్య, సూపర్‌వైజర్ గంగారాం, ఏఈఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

హుస్నాబాద్: హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం కోఆపరేటివ్ కొనుగోలు కేంద్రం స్పెషల్ ఆఫీసర్ సతీష్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి సుజన్ కుమార్, సింగిల్ విండో సీఈఓ తిరుమల, రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ములుగు(గజ్వేల్): అక్రమాల నివారణకు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి తెలిపారు. మండలంలోని వంటిమామిడి రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో పది చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో శుక్రవారం మండల కేంద్రంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్ మాట్లాడుతూ.. రూ. 50 వేలు దాటి డబ్బులు వెంట తీసుకెళ్తే వాటికి సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై తాండ్ర వివేక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ



హుస్నాబాద్‌లో కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హుస్నాబాద్: బీఆర్‌ఎస్ నాయకులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించి కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు రైతుబంధు పథకాన్ని ఆపాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి రైతుల పట్ల వ్యతిరేకతను చాటుకున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజని, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రాంరెడ్డి, నాయకులు చిట్టి గోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, అయూబ్, కొంకట రవి, విజయభాస్కర్, బండి రమణారెడ్డి, పూదరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాడు కరెంటు.. నేడు రైతుబంధు

నంగునూరు(సిద్దిపేట): నాడు కరెంటు వద్దన్న కాంగ్రెస్ పార్టీ నేడు రైతుబంధు వద్దంటూ ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని ప్రజలు గమనించాలని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లింగంగౌడ్, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బద్దిపడగలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉమ, సోమిరెడ్డి, సారయ్య, మల్లయ్య, వెంకట్‌రెడ్డి, పురేందర్, మహిపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, కొండల్‌రెడ్డి, రాజిరెడ్డి, మణిచారి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చౌడారంలో సిద్దిపేట జిల్లా లీడ్ బ్యాంక్, మెదక్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్ హాజరై మాట్లాడారు. బ్యాంకులో పొదుపు చేసే ప్రతి రూపాయి భవిష్యత్ అవసరాలకు భరోసానిస్తాయన్నారు. ప్రత్యేక అవసరాల కోసం ఇచ్చే బంగారు, విద్యా, గృహ, వ్యవసాయ రుణాల గురించి వివరించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ ఎఫ్‌ఎల్‌సీ కౌన్సిలర్ దయాకర్, మెదక్ డీసీసీబీ బ్యాంక్ సిబ్బంది, లీడ్ బ్యాంక్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌ల రహస్య సమావేశం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని 29 గ్రామాల ఉప సర్పంచ్‌లు శుక్రవారం రహస్య సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. సమావేశంలో రాజకీయ భవిష్యత్‌పై కార్యాచరణ, సొంతపార్టీ నేతలు పట్టించుకోకపోవడం, గ్రామాల్లో అభివృద్ధి పనులకు సమాచారం ఇవ్వకపోవడంపై చర్చించినట్లు సమాచారం. ఎన్నికల నేపథ్యంతో వివిధ పార్టీలకు చెందిన ఉపసర్పంచ్‌లు సమావేశం కావడం చర్చనీయాంశంగా మారింది.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట- భూంపల్లి మండలపరిధిలోని రుద్రారం, మిరుదొడ్డి మండల పరిధిలోని ధర్మారంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బొంపెల్లి మనోహర్‌రావు, ధర్మారం ఎంపీటీసీ చెప్యాల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, యువజన నాయకులు ధర్మారం కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయ లబ్ధికోసమే గజ్వేల్‌లో పోటీ'

గజ్వేల్‌రూరల్: రాజకీయ లబ్ధి కోసమే గజ్వేల్ నుంచి ఈటల రాజేందర్ పోటీ చేస్తున్నారని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి విమర్శించారు. శుక్రవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు నర్సింలు, ప్రధాన కార్యదర్శి రమేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హరీశన్నకే ఓటేస్తాం



తీర్మాన కాపీని అందజేస్తున్న సంతోష్‌నగర్ వాసులు

నంగునూరు(సిద్దిపేట): తమ కాలనీని గ్రామ పంచాయతీగా చేసిన హరీశ్ అన్నకే తామంతా ఓటేస్తామని గట్లమల్యాల మధిర గ్రామం సంతోష్‌నగర్ వాసులు గురువారం తీర్మానంచేసి బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అనగోని లింగంగౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ ఫార్మర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డితో కలసి గ్రామస్తులు మాట్లాడారు. మారుమూలగా ఉన్న తమ గ్రామానికి రవాణా సౌకర్యం, మంచి నీటి వసతి, సీసీ రోడ్లు వేయించడంతో పాటు అనేక అభివృద్ధి పనులు చేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి హరీశ్ రావుకు ఓటేస్తామని ఓటర్లు తీర్మానం చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉమ, మాజీ ఎంపీపీలు శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య, ఎంపీపీ ఉపాధ్యక్షురాలు రేణుక, వేణుగోపాల్, సర్పంచ్ రమేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈటల వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న సర్పంచ్‌లు

గజ్వేల్‌రూరల్: సర్పంచ్‌ల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో గ్రామాలు అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధికోసం సర్పంచ్‌లను అవమానించే విధంగా ఈటల మాట్లాడడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మధు, సర్పంచ్‌లు మహేందర్, బాల్‌చంద్రం, బాపురెడ్డి, శివయ్య, శేఖర్ నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

గజ్వేల్‌రూరల్: ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన దళిత కళా మండలి విశ్వజన కళామండలిగా రూపాంతరం జరిగి 45 ఏళ్లు గడుస్తుందని ఉమ్మడి మెదక్ జిల్లా విశ్వజన కళా మండలి సభ్యుడు బాల్‌నర్సయ్య పేర్కొన్నారు. ఈసందర్భంగా గజ్వేల్‌లో అంబేద్కర్ చౌరస్తాలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళిత ప్రజాసంఘాల నాయకులు శ్రీనివాస్, ఎగొండస్వామి, యాదగిరి, మల్లేశం, రాజ్‌కుమార్, స్వామి, రవి, కిసాన్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ విజయం ఖాయం

వర్గల్(గజ్వేల్): సీఎం కేసీఆర్ భారీ మెజారిటీతో హ్యాట్రిక్ విజయం ఖాయమని వర్గల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వర్గల్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీలను ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. జెడ్పీటీసీ బాలూయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, పార్టీ మాజీ అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



మాట్లాడుతున్న క్రిస్టోఫర్ తిలక్

కోహెడ(హుస్నాబాద్): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాల్లో గెలుపొంది ప్రభుత్వం ఏర్పాటుచేస్తుందని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ క్రిస్టోఫర్ తిలక్ అన్నారు. శుక్రవారం మండలస్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి, అప్పులు పెరిగాయన్నారు. హుస్నాబాద్ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేను గెలుపించుకుంటే మంత్రి పదవి వస్తుందన్నారు. 35 రోజులు పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



అక్కన్నపేట: కేంద్ర బలగాల కవాతు

సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట)/అక్కన్నపేట(హుస్నాబాద్): ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బెజ్జంకి మండల కేంద్రంతో పాటు గుండారంలో కేంద్ర బలగాలు, బెజ్జంకి పోలీసులతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రశాంత వాతావరణం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ సీఐ చేరాలు, బెజ్జంకి ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి, బీఎస్‌ఎఫ్ అధికారులు, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు. అలాగే హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కేంద్ర బలగాలు, పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహించారు.

గజ్వేల్‌లో పోలీసుల కవాతు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణంలో ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ జానకిరాంరెడ్డి, కృష్ణ, ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రఘునందన్‌రావుకు గుణపాఠం తప్పదు



దుబ్బాకలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దుబ్బాక: దుబ్బాకలో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమని బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండవెళ్లి ఎల్లారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 20, 19, 15 వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తప్పుడు ప్రచారాలతో గెలుపొందిన ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆస యాదగిరి, పల్లె మీన రామస్వామిగౌడ్, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు వంశీకృష్ణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ 'యుద్ధభేరి'కి తరలిరండి

తొగుట(దుబ్బాక): నవంబర్ 5వ తేదీన నిర్వహించే మాదిగల యుద్ధభేరిని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దిని రాజమల్లయ్య మాదిగ కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

◆ అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

మద్దూరు(హుస్నాబాద్): సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని దూళ్మిట్ట మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద యాదగిరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు.

◆ పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

దుబ్బాక: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ధర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ వినోద్ మోదాని సహకారంతో శుక్రవారం సుమారు 80 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను పంపిణీ చేశారు.

◆ మైనార్టీలపై దాడులు సరికాదు

గజ్వేల్‌రూరల్: ఎస్‌డీఎఫ్ సభ్యురాలు మహమ్మద్ సుల్తానా ఉమర్‌పై బీజేపీ నేతల దాడిని ఖండిస్తున్నామని ఎస్‌డీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఆకునూరి మురళి పేర్కొన్నారు. ఈసందర్భంగా గజ్వేల్‌కు చెందిన పలువురు మురళిని కలిశారు.

◆ ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి

ములుగు(గజ్వేల్): విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలని ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని తున్కిబొల్లారం కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థులకు యాంటీ హ్యూమన్, ట్రాఫిక్, ర్యాగింగ్, గుడ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు.

◆ రైతుబంధుపై విమర్శలు మానుకోవాలి

బెజ్జంకి(సిద్దిపేట): రైతుబంధు, రుణమాఫీలకు నిధులు లేక కాంగ్రెస్‌పై నిందలు వేస్తున్న బీఆర్‌ఎస్‌కు రైతులే గుణపాఠం చెబుతారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డితో కలిసి శుక్రవారం మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, రాములు, మల్లేశం, నరేందర్‌రెడ్డి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

◆ వినతి

హుస్నాబాద్: సౌకర్యాలు లేకుండా కొనుగోలు కేంద్రాలను ఎలా ప్రారంభిస్తారని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం మార్కెట్ యార్డ్ కార్యదర్శి సుజన్ కుమార్‌ను వినతిపత్రం ఇచ్చారు.

◆ నిధులు విడుదల చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాల అమలుకు నిధులు విడుదల చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

◆ అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్

జగదేవ్‌పూర్(గజ్వేల్): అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు నరేష్ అన్నారు. శుక్రవారం జగదేవ్‌పూర్‌లో వారు మాట్లాడారు.

